ఒంటరితనాన్ని ఒక్కసారిగా విదిలించి కొట్టి వదిలించుకొని, ఖాళీ కప్పుతో వంటింటివైపు నడిచాడు.

ఒక వారం రోజుల్లో ప్రాపర్టీ అంతా ఎస్టిమేషన్ వేయించాడు శశాంక. స్రవంతి మరెప్పుడూ ఆ ప్రస్తావన తేలేదు. మౌనంగా ఉండిపోయింది. తనకు భర్త చేస్తున్న పని సుతరామూ ఇష్టం లేకపోయినా ఇంట్లో తుపాను సృష్టించి తన మనసు పాడు చేసుకొని, అతడి మనసు పాడుచేసి, ఇంటి వాతావరణం అంతా అల్లకల్లోలం చేసేబదులు ఒక మౌన ప్రేక్షకురాలిలా ఉండడమే మేలు అనిపించిదామెకు.

చెల్లెలి ఊరికి ప్రయాణం కట్టిన శశాంక చేతికి తాను స్వయంగా తయారు చేసిన అరిసెలు, జంతికలు అందజేసి సాదరంగా సాగనంపింది. అలా చేయడంలోనే తన మర్యాద దాగి ఉంది అనిపించింది.

హఠాత్తుగా ఊడిపడ్డ శశాంకని చూస్తూనే ఆనందం, ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అయింది శ్రుతి. "అబ్బో, ఎన్నాళ్ళకెన్నాళ్ళకి నువ్విలా రావడం! ఏదైనా పనిమీద వచ్చావా అన్నయ్యా" అంటూ నవ్వుతూ ఎదురొచ్చింది.

"ఏం? ఏదైనా పని ఉంటేనే రావాలా మీ ఊరు? నిన్ను చూడ్డానికి రాకూడదా ఏం" అంటూ గడుసుగా ఎదురు ప్రశ్న వేశాడు శశాంక, చేతిలోని బ్యాగ్‌ని చెల్లెలికి అందిస్తూ.

"ఊఁ, మహా నన్ను చూడ్డానికి ఎన్నిసార్లు వచ్చారండీ తమరు? ఇదిగో ముందు ఈ చల్లని నీళ్ళు తాగు. అవునూ పిలల్నీ, వదిన్నీ తీసుకురాకూడదూ? నాలుగు రోజులుండి వెళ్ళేవారుగా. ఈ చదువులు, ఉద్యోగాల పుణ్యమా అని సంవత్సరాల తరబడి ఒకర్నొకరు చూసుకోవడం పడడమే లేదురా అన్నయ్యా! అరే, పదకొండు అయింది. ఉండు కొంచెం టీ తీసుకొస్తా. ఉదయం టిఫిన్ ఎప్పుడు తిన్నావో ఏమో" అంటూ హడావిడిగా వంటింట్లోకి వెళ్ళింది శ్రుతి.

సోఫాలో కూర్చుని చెల్లెలు పెయింట్ చేసిన చిత్రాలని చూస్తూ ఉండిపోయాడు శశాంక కాసేపు.

"అవునూ మీ ఆయన, పిల్లలు ఏరీ శ్రుతీ. ఎవరూ కనిపించరేం. కొంపదీసి ఇంకా నిద్రపోతున్నారా ఏం" అన్నాడు తదేకంగా వాల్ హ్యాంగింగ్స్‌నే చూస్తూ.

"ఆయన కాన్ఫరెన్స్ ఉందని నాగపూర్ వెళ్ళారు. పిల్లలిద్దరూ మా బావగారింటికి వెళ్ళారు నిన్న సాయంత్రం. స్కూల్లో ఏదో డ్యాన్స్ డ్రామా వేయబోతున్నారు. అందుకని వాళ్ళింట్లో రిహార్సల్ కోలాహలం. పిల్లలు కదా, వాళ్ళ ప్రపంచం వాళ్ళది" అంది శ్రుతి వంటింట్లో నుండి టీ కప్పుతో డ్రాయింగ్ రూమ్‌లోకి వస్తూ.

చిత్రాలు: నర్సిం



మధ్యాహ్నం భోజనం చేశాక తీరిగ్గా అసలు విషయం బయటపెట్టాడు శశాంక. ఆసక్తిగా అంతా విన్నాక నింపాదిగా అతడి ముఖంలోకి సూటిగా చూసింది శ్రుతి.

"అయితే, ఆస్తిలో సగం వాటా నాకు ఇవ్వాలని నిర్ణయించుకున్నావన్నమాట" అంది చివరికి.

అవునన్నట్లు తలూపాడు శశాంక.

"నా వాటాకి కట్టకింద పొలం అయిదెకరాలు, ఏడెకరాల మామిడి తోట, నాలుగెకరాల చెరుకు మడి, లక్ష రూపాయల నగదు. ఊఁ, బాగానే ఉంది. ఇంతేనా, మరింకేదైనా ఉందా పంచడానికి" అంది ముఖంలో ఎలాంటి భావాలూ వ్యక్తం కానీయకుండా.

ఇల్లు... ఇల్లు ఉందికదమ్మా! దాన్ని రెండు భాగాలుగా చేయడం ఎందుకులే అని..." అంటూ నానుస్తూ ఉండిపోయాడు శశాంక. అలా చెప్పాల్సిరావడం ఎంతో ఇబ్బందికరంగా అనిపించింది అతనికి. కొంచెంసేపు ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయింది శ్రుతి. ఆమె ముఖంలో దాగి ఉన్న భావాలని చదవాలని ఎంతగానో సతమతమయ్యాడు శశాంక.

ఎందుకనో ఆమె అంత సుముఖంగా ఉన్నట్లు అనిపించలా. ఎప్పుడూ కనిపించే ప్రసన్నత, ప్రశాంతత ఆమె ముఖంలో ఆ సమయంలో లోపించినట్లు గ్రహించగలిగాడు. చెల్లెలు తన నిర్ణయం విన్నాక ఎంతో హర్షిస్తుంది, ఎంతో మెచ్చుకుంటుంది అని ఏదేదో ఊహించుకున్న అతడికి హిమాలయ పర్వతం మీద నుండి హిందూమహాసముద్రం లోకి పడిపోయినట్లనిపించింది.

"నీకు ఈ మాదిరి డివిజన్ నచ్చలేదామ్మా? చెప్పు, ఎందుకంత ముభావంగా ఉన్నావు" అన్నాడు కంగారుగా.

శ్రుతి ఏదో అనబోయే లోపల కాలింగ్ బెల్ మోగడం, ఆమె స్నేహితురాలు గలగలా మాట్లాడుతూ ఇంట్లోకి రావడం జరిగింది.

"ఓ అర్థగంటలో వచ్చేస్తా అన్నయ్యా. కొంచెం అర్జెంటు పని ఉంది" అంటూ స్నేహితురాలితో బయటకు ఎక్కడికో వెళ్ళింది శ్రుతి.

ఏవేవో ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముట్టాయి శశాంకని.

ఎందుకలా ప్రవర్తించింది శ్రుతి? ఇలాంటి విభజన న్యాయంగా అనిపించలేదా? కానీ, ఆశించిన ఆస్తి అమాంతంగా దక్కినందుకు ఆనందించాలి గానీ ఇందులో నిరాశపడేదేం ఉంటుంది? లేక అసలు ఆస్తి పంపకమే నచ్చలేదా? కారణం ఏమై ఉంటుంది అనుకుంటూ ఆలోచనలోపడ్డాడు శశాంక.

'ఒకవేళ ఇల్లు కావాలని ఉందేమో' అనుకున్నాడు గబుక్కున ఇంటిని గుర్తుతెచ్చుకుంటూ. తన తండ్రి ఎంతో ముచ్చటపడి కట్టించుకున్న ఇల్లు అది. చిన్న ఇల్లు... ఇంటి చుట్టూ విశాలమైన ఆవరణ. దాన్నిండా రకరకాల పూలచెట్లు, పళ్ళచెట్లు... అదొక అందమైన, అపురూపమైన ప్రపంచం శశాంక దృష్టిలో. ఎన్నెన్నో జ్ఞాపకాలు ఆ ఇంటి చుట్టూ గిరికీలు కొడుతూ మనసులోకి చొరబడతాయి. బాల్యం నుండి యౌవనంలోకి అడుగుపెట్టింది ఆ ఇంట్లోనే. ఓ ఇంటివాడయ్యాక స్థిరపడిందీ ఆ ఇంట్లోనే. చెల్లెల్ని ఓ ఇంటిదాన్ని చేసి పంపిందీ ఆ ఇంటి నుండే. ఇద్దరు బిడ్డలకు తండ్రయిందీ ఆ ఇంట్లోనే. తల్లినీ, తండ్రినీ కడసారిగా సాగనంపిందీ ఆ ఇంటి నుండే. మంచికీ చెడుకూ, కష్టానికీ సుఖానికీ ఆశ్రయం ఇచ్చి ఆదుకున్నదీ ఆ ఇల్లే. అందుకే శశాంకకి ఆ ఇల్లంటే ఎంతో మక్కువ. ఎంతో మమకారం.

ఒకవేళ శ్రుతి ఆ ఇల్లు కావాలని అడిగితే ఏం చేయాలి? తన ఇష్టానిష్టాల మాట అటుంచి అసలు స్రవంతికి ఏం సంజాయిషీ ఇచ్చుకోవాలి అనుకున్నాడు అయోమయంగా. ఒకవైపు తోడబుట్టిన చెల్లెలు, మరో పక్క తోడూనీడలాంటి అర్ధాంగి...



ఎవర్ని ఒప్పించాలి? ఎవర్ని మెప్పించాలి అనుకున్నాడు పదేపదే. తుపానులో చిక్కుకున్న నావలా ఊగిసలాడింది మనసు. ఎంత గాలించినా తీరమే కనిపించలా ఆ సమయంలో.

పోనీలే, నాకంటే ఆరు సంవత్సరాలు చిన్నది. నా తోడబుట్టింది. దానికీ ఆ ఇల్లంటే మక్కువేమో! పోనీ, దానికే ఇచ్చేస్తే పోలా? ఇల్లు ఎవరి పేరున ఉంటే ఏం? ఆ ఊరొచ్చి అదేం ఉండబోదుగా? అంతగా అయితే నెలకింత అని అద్దె చెల్లిస్తే సరిపోయే... అనుకుని మనసుని సరిపెట్టుకున్నాడు శశాంక చివరికి. ఆ నిర్ణయం మనసుకెంతో ఊరట కలిగించి ఉల్లాసంగా అనిపించింది.

స్నానం చేద్దామని లేవబోయేంతలో శ్రుతి రానే వచ్చింది. వస్తూనే టీ తయారుచేసి తెచ్చింది.

"ఊఁ, ఇప్పుడు చెప్పు తీరిగ్గా. ఆస్తి ఇలా వాటాలు వేయాలని ఎందుకనిపించింది తమరికి" అంది సోఫాలో జారగిలపడి, బుగ్గన చేయి ఉంచుకుని శశాంక వైపు చూస్తూ.

"ఎందుకో ఒకందుకు అనిపించింది కానీ, నువ్వెందుకలా ఉన్నావో ముందు చెప్పు శ్రుతీ. నా నిర్ణయం నీకు నచ్చలేదా" అన్నాడు శశాంక సూటిగా.

"నచ్చలేదు. బొత్తిగా నచ్చలేదు." అంతకంటే సూటిగా జవాబిచ్చింది శ్రుతి.

ఫ్రాక్ వేసుకుని తనవెంట 'అన్నయ్యా, అన్నయ్యా' అంటూ తిరిగిన చిన్న పిల్ల శ్రుతి రూపం మనసులో మెదులుతుంటే, "పోనీ, నీకేం కావాలో చెప్పమ్మా. మన ఇల్లు కావాలా? చెప్పు... దాన్దేముంది... నో ప్రాబ్లమ్. ఆ ఇంటిపై నాకెంత హక్కు ఉందో నీకూ అంతే ఉందమ్మా" అన్నాడు శశాంక దిగ్గున లేచివచ్చి చెల్లెలి తల నిమురుతూ.

శశాంక వైపు దిగులుగా చూసింది శ్రుతి. కళ్ళలో

> "అమ్మ కుట్టిన పూల దుప్పటి కావాలిరా అన్నయ్యా! నాకింకేం వద్దు" అంది శ్రుతి శశాంక చేయి పట్టుకుని వెక్కివెక్కి ఏడుస్తూ.

చివ్వున కన్నీళ్ళు పొంగుకొచ్చాయి. "అమ్మ కుట్టిన పూల దుప్పటి కావాలిరా అన్నయ్యా! నాకింకేం వద్దు" అంది శశాంక చేయి పట్టుకుని వెక్కివెక్కి ఏడుస్తూ.

నివ్వెరపోయాడు శశాంక.

"ఆఁ... అదేంటి శ్రుతీ! అదేం జోక్" అన్నాడు వింతగా చూస్తూ.

"జోక్ కాదన్నాయ్! నిజంగానే సీరియస్‌గా అంటున్నా. నాకు ఆ దుప్పటి కావాలి. అమ్మ నా చిన్నప్పుడు కుట్టింది అది. తెల్లని పాల నురుగులాంటి దుప్పటి. దాన్నిండా రంగురంగుల ఎంబ్రాయిడరీ పూలు కుట్టింది అమ్మ. ఎంత అందంగా కుట్టిందనుకున్నావ్. గబగబా ఏరుకుని దండ గుచ్చి తల్లో పెట్టుకోవాలనిపించేంత అందమైన పూలు అవి." అవ్యక్తమైన ఆనందంతో వర్ణిస్తోంది శ్రుతి. నవ్వొచ్చింది శశాంకకి. ఎంతో వాత్సల్యంగా చూస్తూ ఉండిపోయాడు.

"నీకు నవ్వొస్తోంది కదూ? కానీ, నాకు ఆ దుప్పటి అంటే ఎంతో ఇష్టంరా అన్నయ్యా! చిన్నప్పుడు ఎప్పుడూ పోట్లాడేదాన్ని అది నా మంచంపై కప్పమని. అమ్మ ఒప్పుకునేది కాదు నేను మట్టి అంటిస్తానని. ఒక రోజు నా పోరు పడలేక నా మంచంపై వేసింది. సంతోషం పట్టలేక మట్టికాళ్ళతో గబుక్కున మంచం ఎక్కేశా. అంతే, వీపు విమానం మోత మోగించింది అమ్మ. నువ్వు స్కూలు నుంచి రాగానే నీకంతా చెప్పా ఏడుస్తూ. నన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చావు. నాకు అదంతా బాగా గుర్తేరా. పాపం అమ్మ నానా అవస్థపడి ఆ దుప్పటి ఉతికి ఆ మరకలన్నీ పోగొట్టింది. నా పెళ్ళయ్యాక ఆ దుప్పటి ఇవ్వబోయింది గానీ, అమ్మకంత ఇష్టమైన ఆ వస్తువు తీసుకోవడానికి ఎందుకనో మనస్కరించలా అప్పుడు. ఆ తరువాత ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. అమ్మా నాన్నా ఇద్దరూ లేరిప్పుడు. పెద్ద అలలైనా, చిన్న అలలైనా ఒడ్డు వరకే కదా వస్తాయి! ఆ తరువాత ఇసుకలో కలిసిపోతాయి. మనుషులూ అంతే. మొదట్లో బాధని పించేది. ఆ తరువాత అలవాటైపోయింది. ఏమిటో, కొంత కాలం బాధపెడ్తాయి నిజాలు. ఆ తరువాత అవి జ్ఞాపకాలుగా మారిపోతాయి" అంది శ్రుతి పమిట చెంగుతో కళ్ళొత్తుకుంటూ.

"పిచ్చి ముఖమా, దీనికి నువ్వింతగా ఇదవ్వాలా? నీకంత ఇష్టం అని తెలిస్తే ఎప్పుడో ఇచ్చి ఉండేది మీ వదిన. అద్సరే గానీ, ఆస్తి వివరాలు అవీ..." అంటూ ఏదో చెప్పబోతున్న శశాంకని అతి సున్నితంగా నివారించింది శ్రుతి.

"వద్దు శశన్నయ్యా! ఈ ఆస్తి పంపకాలు అవీ నాకు ఇష్టం లేదు. స్త్రీకి ఎంత వయసు వచ్చినా పుట్టింటిపై అపేక్ష, ఆత్మీయత, ఆశ, అనుబంధం చావవురా. మంచీ చెడూ చెప్పుకునే దానికి, సుఖం దుఃఖం పంచుకునేదానికి, ఆపదలో ఆదరించేదానికి, ఆదుకునేదానికి పుట్టింటి వాళ్ళున్నారు అన్న భరోసా చాలు జీవిత సాగరాన్ని సునాయాసంగా ఈదడానికి. మనసులోని వెలితిని తీసేయాలంటే, వెతల్ని తోసేయాలంటే పుట్టింటివాళ్ళ ఆత్మీయత ఎంతో అవసరం ఆడపిల్లలకి. ముఖ్యంగా యాంత్రికంగా మారిపోతున్న ఈ ఆధునిక జీవన విధానంలో" అంది శ్రుతి వేదాంతిలా చూస్తూ.

"ఇదేంటమ్మా శ్రుతీ! స్త్రీ సంక్షేమానికీ, సమాన హక్కులకీ విలువిచ్చి పోరాడుతున్న ఈ రోజుల్లో నువ్వు ఇలా వ్యతిరేకంగా మాట్లాడుతున్నావు" అన్నాడు శశాంక ఆశ్చర్యంగా చూస్తూ.

"అహఁ... అలా అనుకోకు అన్నయ్యా! అన్ని రంగాల్లో స్త్రీలకి సమాన హక్కులు ఉండాలి అని విశ్వసించేవాళ్ళల్లో నేనూ ఒకదాన్నే. కానీ, ఈ విషయంలో నా అభిప్రాయం కాస్తంత వేరుగా ఉంది, అంతే. నేను అడిగే ఈ ప్రశ్నకి సూటిగా జవాబు చెప్పు ముందు. మగ పిల్లలతో సమానంగా చదివించి, వాళ్ళ కాళ్ళపై వాళ్ళు నిలబడేలా అవకాశాలు కల్పించి, చివరికి ఏ అయ్య చేతిలోనో పెట్టేటప్పుడు మాత్రం బేరసారాలకి తలవంచి, అప్పయినా చేసి అడిగినంత కట్నం ఇచ్చి ఎందుకు సాగనంపుతూ ఉంటాం మనం ఆడపిల్లల్ని?"

"అది ఆనవాయితీ కదమ్మా! తరతరాలుగా తరలి వస్తున్న ఆచారం అది మరి" అన్నాడు శశాంక, తాను అంటున్నది తనకే అంత సబబు అనిపించకపోయినా ఏదోవిధంగా సమర్థించడానికి ప్రయత్నిస్తూ.

"అదో, అక్కడే మొదలవుతోంది అసలైన విషమ సమస్య. అబ్బాయిలతో సమానంగా అన్ని రంగాల్లో అవకాశాలు కలిగిస్తున్నారు తల్లితండ్రులు. కానీ, కట్నం విషయం వచ్చేసరికి అన్ని ఆశయాలూ, అన్ని ఆదర్శాలూ ఓ పక్కకి నెట్టేసి నానా అగచాట్లూ పడి పెళ్ళిళ్ళు

చేస్తున్నారు. 'కట్నం ఇవ్వం' అని ఆడపిల్ల తల్లితండ్రులు అనరు. 'కట్నం తీసుకోం' అని మగపిల్లల తల్లితండ్రులూ అనరు. ఎంతెంత మంచి క్వాలిఫికేషన్స్ ఉన్నా 'కట్నం ఇవ్వం, తీసుకోం' అని గుండెలపై చేయివేసి నిండుగా ఏ ఆడపిల్లా చెప్పడంలా, ఏ మగపిల్లవాడూ చెప్పడంలా. మరి అలా కట్నాలు ఇచ్చిపుచ్చుకుంటున్నప్పుడు ఇక ఆస్తిలో సగం వాటా ఆశించడం దేనికి ఏ ఆడపిల్ల అయినా? ముందు డౌరీ అనేదాన్ని ఎబాలిష్ చేసి, ఆ తరువాత మాట్లాడాలి ఆస్తిలో సగం వాటా గురించి. చూడు అన్నయ్యా, ఒక విషవృక్షాన్ని తొలగించాలంటే కొమ్మలు, రెమ్మలు నరికితే ఏం ప్రయోజనం. భూమిలో లోతుకు పాతుకుపోయిన వేళ్ళని సమూలంగా నరికి నాశనం చేయాలిగానీ..." అంటూ ఆవేశంగా తలెత్తి శశాంక పైపు చూసింది శ్రుతి. ఎంత ఉన్నత శిఖరాలకి ఎదిగిపోయింది తన చెల్లెలు అనుకుంటూ తదేకంగా శ్రుతి వైపు చూస్తూ ఉండిపోయాడు శశాంక.

"కానీ, నా మాట కాదనకు శ్రుతీ ఈ ఒక్కసారికీ" అన్నాడు చివరికి ఎంతో అనునయంగా.

"నువ్వూ నా మాట కాదనకు. తోబుట్టువుకు ఆస్తిలో సగం వాటా ఇవ్వాలనుకోవడం నీ ఔదార్యం. అయితే, దాన్ని అంగీకరించకుండా ఉండడం నా మర్యాద. నా పెళ్ళికి మీరప్పుడు కట్నం పేరుతో ఇంత ముడుపు చెల్లించుకోకుండా ఉంటే బహుశా నీ ఈ ఆఫర్‌ని కాదని ఉండేదాన్ని కాదేమో! అప్పుడు నాన్నకి ఎంతో చెప్పి చూశాను డౌరీ ఇస్తే నేను ఆ పెళ్ళి చేసుకోను అని. ఆయనా మొత్తుకున్నాడు తన తల్లితండ్రుల దగ్గర కట్నం వద్దంటూ. ఎవరూ మా మాటల్ని వినిపించుకోలా. మాకూ, ముఖ్యంగా నాకు అంత ఎదురు తిరిగేంత, మీ అందరి సెంటిమెంట్స్ హర్ట్ చేసేంత ధైర్యం లేదు అప్పుడు. అయినా, హక్కుల కోసం సాగే పోరాటంలో మనిషికీ, మనసుకీ విలువలు ఉండవురా అన్నయ్యా! అలాంటి హక్కులు నాకు వద్దు. ప్లీజ్. డబ్బు కంటే విలువైనవీ, వెల కట్టలేనివీ కొన్ని బంధాలు, అనుబంధాలు ఉన్నాయి. వాటికి ప్రాధాన్యం ఇవ్వడం మన ధర్మం కాదూ! చెప్పు. అనంత యాత్రగా మారిన ఈ జీవిత విధానంలో ఎంత యాంత్రికంగా బతికేస్తున్నాం. ఎన్నెన్నో సమస్యలు సతమతం చేస్తూ, సతాయిస్తూ తమాషా చూస్తుంటే ఎంత మౌన ప్రేక్షకుల్లా మిగిలిపోతున్నాం. నో... నో... కొందరమన్నా కొంత మార్పయినా తీసుకురావాలి. నీకు అంతగా నాకు ఇవ్వాలనిపిస్తే పోనీ ఓ పని చేయి. ఆర్థిక స్తోమత లేక అల్లాడుతున్న ఇద్దరు ముగ్గురు అమ్మాయిల్ని ఆదుకుని వాళ్ళని చదివించు. కట్నం ఇవ్వడం, పుచ్చుకోవడం ఎంత దుర్దశకి దారితీస్తుందో నీ చుట్టూ ఉండేవాళ్ళకి అర్థమయ్యేలా విడమరచి చెప్పు. సమాన హక్కుల ఆరాటం, పోరాటం అవసరమేగానీ ఆత్మీయత, ఆప్యాయతల్ని విస్మరించొద్దని చక్కగా నచ్చజెప్పు. అలా చేస్తే నన్ను ఆదరించినట్లే. నీకొకటి చెప్పనా అన్నయ్యా! మనం ఏమేం మంచి పనులు చేశాం అని ప్రశ్నించుకున్నప్పుడు, 'ఇవిగో, ఇవీ... ఫలానా ఫలానా మంచి పనులు మీరు చేసినవి' అంటూ ఇతరుల హృదయాంతరాళంలోంచి జవాబులు రావాలి. అప్పుడూ జీవితానికి సార్థకత లభించేది.

అరే, ఇదేంటి ఇలా ఉపన్యాసాలిస్తూ కూర్చున్నానూ? చూడు, ఎంత చీకటి పడిందో. వంట చేయాలి. నీకిష్టం అయిన క్యారట్ హల్వా చేసిపెట్టనా" అంటూ నిండుగా నవ్వుతూ వంటింటి వైపు వెళ్ళిపోయింది శ్రుతి హడావిడిగా.

ఆమెలో తన తల్లి రూపం కనిపిస్తుంటే శశాంక కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కిటికీ దగ్గరకు వెళ్ళి ఆకాశం వైపు చూస్తూ నిలుచున్నాడు. అమ్మ దుప్పటి గుర్తొచ్చింది. ■

# కొత్త కోణాల్లో జీవన దర్శనం

*సంక్షుభిత సామాజిక వాతావరణాన్ని శక్తిమంతంగా చిత్రించిన కథలు*



**కథ 98**
సంపాదకులు: వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ శాఖ లన్నిటిలో.
పేజీలు: 120;
వెల: రూ. 35/-

ఎ.ఎ.వి. ప్రసాద్

తెలుగు సాహిత్యంలో ఏటేటా సామాజిక చైతన్యాన్నీ, వస్తుశిల్పాల రీత్యా వైవిధ్యాన్నీ సొంతం చేసుకున్న ఉత్తమ కథలను ఏర్చికూర్చి వార్షిక సంకలనాలుగా తీసుకువచ్చే మంచి సంప్రదాయాన్ని వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌లు తొమ్మిదేళ్ళ నుంచీ ప్రశంసనీయంగా నిర్వహిస్తున్నారు. ఈ ఒరవడిలో తాజాదీ, తొమ్మిదవదీ అయిన *కథ 98* సంకలనం ఉన్నత ప్రమాణాలతో వెలువడింది. ఇందులోని 12 కథలలో వర్తమాన సమాజపు విలువల రాహిత్యాన్నీ, అందులో మనిషి అనుభవించే ఒంటరితనాన్నీ శక్తిమంతంగా చిత్రించిన కథలున్నాయి. నేటి సమాజంలోని భయవిహ్వల వాతావరణాన్ని వైవిధ్యభరితమైన శిల్పంతో చిత్రించిన కథలున్నాయి. కేబుల్ టీవీ పుణ్యమా అని అంతా వినోదమయమైపోయిన ఈ రోజుల్లో కూడా పఠనాసక్తినీ, సామాజిక బాధ్యతనూ, జ్ఞాన తృష్ణనూ రగిలించే శక్తి కథా ప్రక్రియకు ఉందని నిరూపించిన సంకలనం *కథ 98*.

నక్సలైట్లు, పోలీసుల మధ్య నడుస్తున్న యుద్ధం తీవ్రత, దాని విషాద పర్యవసానాలు నేడు అందరికీ పరిచితమే. మృత్యువు తెచ్చే విషాదానికి వాళ్ళూ వీళ్ళనే తేడా లేదని అప్పల్నాయుడు కథ వాళ్ళు ఆవిష్కరించింది. ప్రజల కోసం ఉద్యమించే వాళ్ళను ఏదో శత్రు దేశ సైనికుల్లా పరిగణించి హతమార్చే రాజ్యవ్యవస్థ తీరుతెన్నులు ఇందులో ప్రదర్శితమయ్యాయి. ఈ యుద్ధంలో రెండు పక్షాలూ హద్దులు దాటుతున్నాయా? ఉద్యమాన్ని తుపాకులతో నిర్మూలించడం సాధ్యమవుతుందా? అలాగే, కేవలం తుపాకులతోనే ఉద్యమం విజయవంతమవుతుందా అనే ప్రశ్నలను ఈ కథ లేవనెత్తింది.

హింసాయుత పోరాటం మిగిల్చే కన్నీటి స్మృతులనూ, ఆ పోరులో దురన్యాయాలకు బలైనవారి ఆత్మక్షోభనూ, అలా బలితీసుకున్నవారి వారసుల ఆత్మక్షాళననూ గోపరాజు నారాయణ రావు కథ క్షమార్పణం చిత్రించింది. అల్లూరి సీతారామరాజు తెల్లవాళ్ళపై పోరాటం జరిపిన మన్యం ప్రాంతాన్ని నేపథ్యంగా తీసుకుని రాసిన ఈ కథకు, ప్రస్తుత ఎన్‌కౌంటర్ల జోరులో ఎంతో ప్రాధాన్యం ఉంది.

ప్రజా ఉద్యమ నేపథ్యంలో సౌదా అల్లిన ఫోటోగ్రాఫర్ కథ గొప్ప శిల్పచాతుర్యంతో నడుస్తుంది. 'ఇంతకీ ఆ పిల్ల మాట్లాడింది ఫోటోగ్రఫీ గురించేనా?' అన్న ప్రశ్నతో ముగిసే ఈ కథ జీవన సత్యాలనూ, సౌందర్యాన్నీ అర్థం చేసుకోవడానికి మాటలు చాలవని సందేశిస్తుంది. ప్రజా ఉద్యమాల గురించిన వాస్తవాలను అవగాహన చేసుకోవడానికి కావలసిన మనస్తత్వాన్ని అంతర్లీనంగా ఆవిష్కరించిన కథ ఇది. కాట్రగడ్డ దయానంద్ తలపాగా స్వగతం రైతుల ఆత్మహత్యల పట్ల వ్యవస్థ నిరాసక్తతను వెల్లడి చేసింది.

డాక్టర్ వి. చంద్రశేఖర రావు కథ బ ఫెల్లోస్ క్లబ్ విలక్షణ శైలిలో నడుస్తుంది. దళితులకు రాజకీయ హక్కులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇచ్చి ఉద్ధరించేశామని పాలక వర్గాలు ఆర్భాటం చేస్తుంటాయి. కానీ, నిజమైన పెత్తనం ఎవరి చేతుల్లో ఉందో అందరికీ తెలిసిన సత్యమే. పెత్తందారుల దౌష్ట్యాన్ని జుగుప్సతో, ఆవేశంగా చిత్రించిన కథ ఇదీ. స్రియలిస్ట్ ధోరణితో రచయిత కథ చెప్పిన తీరు ఎంతో ఆకట్టుకొంటుంది. తెలుగు కథ అలవర్చుకొంటున్న నూతన పోకడలకు బ ఫెల్లోస్ క్లబ్ ప్రతీక.

చుట్టూ ఉన్న జీవితంలో ఎన్నో మార్పులు వస్తుంటాయి. కాలం గడిచేకొద్దీ ఆ మార్పులు నిత్యజీవితంలో అంతర్భాగాలుగా మారి మామూలు దృష్టికి ఆనకుండా పోతాయి. అయితే, ఆ మామూలు సన్నివేశాల వెనుక ప్రాతిపదికగా ఉన్న లోతైన అంశాలను అద్భుతంగా చిత్రించిన కథ సతీష్ చందర్ సీగ్గు. అంటరాని మనిషి ఒంటి మీద వస్త్రం రెపరెపలాడడమే తిరుగుబాటుగా ప్రతిపాదించిన కథ ఇది. తరతరాలుగా అవమానాలను ఎదుర్కొంటున్న దళిత జాతి అంతరాత్మలో ఆత్మగౌరవం కోసం రగిలే తపనను పాఠకుల గుండెల్లో కూడా నింపడంలో రచయిత సఫలమయ్యారు.

> మూడువేల ఏళ్ళు ముంత వేళ్ళాడిన స్థానంలో నెక్‌టై... స్తంభానికి జెండా ఎగరడం కాదు, అంటరాని మనిషి మీద వస్త్రం రెపరెపలాడడమే తిరుగుబాటు. -పుట 46

మనిషి జీవితంలో బాల్యం మరపురాని మధుర ఘట్టం. గోపిని కరుణాకర్ దుత్తలో చెందమామ, లెనిన్ ధనిశెట్టి మౌనవీణ *గానమిది* కథలు ఆ బాల్యాన్ని రెండు కోణాల నుంచి స్పృశించాయి. మొదటి కథ జానపద కథల అమాయకత్వంతో గ్రామీణ నేపథ్యంలో బాల్యాన్ని మధురంగా, ఆర్ద్రంగా తలపునకు తెస్తే, రెండవ కథ పట్టణ ప్రాంత బీభత్సం మధ్య ఒక టీచర్ దృష్టి నుంచి ఈనాటి స్కూళ్ళ వాతావరణాన్ని, స్వేచ్ఛ లేని తనాన్ని చైతన్య స్రవంతి పద్ధతిలో వ్యక్తీకరించింది.

సౌదుం జయరాం మనువు కథ వివాహం విషయంలో స్త్రీకి ఉండవలసిన స్వేచ్ఛను నిర్వచిస్తే, ఎస్. జయ రెక్కలున్న పిల్ల ఆ స్వేచ్ఛను అందుకున్న యువతితో సహజీవనాన్ని చిత్రించింది.

మైనారిటీల జీవితంలో మతతత్త్వం చిమ్ముతున్న విషాన్ని, వారిలో పెరుగుతున్న అభద్రతాభావాన్ని వెలుగులోకి తెచ్చిన కథ మహమ్మద్ ఖదీర్ బాబు రచించిన జమీన్. పాపినేని శివశంకర్ కథ సగం తెరచిన తలుపు నోస్టాల్జియా ఇతివృత్తంగా సాగింది. నగర జీవితంలోని ఒంటరితనంతో పల్లెల ఆత్మీయతను పోల్చి, మనిషి తనకు తానూ, సాటి మనిషికీ కూడా వేరు కాకూడదని చాటింది. ■